# మేడమీద కాపురం

అప్పారావుకి అర్జంటుగా ఇల్లు మారాల్సిన అవసరం వచ్చింది.

వాడు అద్దెకుంటున్న ఇల్లు విక్రయమై పోయింది.

అందువల్ల అగ్రిమెంటు ప్రకారం పాత వాళ్లను ఖాళీ చేయించి, కొన్నవాళ్లకు అప్పజెప్పాల్సిన బాధ్యతకొద్దీ ఇంటివాళ్లు అప్పారావుని మరో ఇల్లు వెతుక్కోమన్నారు. వాడు నా దగ్గరకొచ్చి బావురుమన్నంత పనిచేసాడు.

జాలిపడి, ఎట్టకేలకు ఓ ఇల్లు చూపించగలిగాను. అది మేడ మీద వాటా. వెంటనే



జేరిపోయాడు.

అప్పారావు భార్య అలివేణి కాస్త నోటిదురుసు మనిషి. అందువల్ల ఇరుగుపొరుగులతో పొరపొచ్చాలకు అవకాశం లేని మేడమీద కాపురమే మంచిదనిపించిందన్నాడు అప్పారావు.

నాకూ నిజమేననిపించింది.

తనకింత సాయం చేసినందుకుగాను ఆదివారం తనివ్వబోయే అతిథి సత్కారం స్వీకరించమని బలవంతం చేసాడు. కాదంటే బాధ పడతాడని 'సరే'నన్నాను.

"అన్నయ్యగారూ! మీ పుణ్యమాని ఇరుగు పొరుగు బాధల్లేని మేడమీద వాటా ఇప్పించారు. ప్రాణం హాయిగా ఉంది..." గడ్డపెరుగు వడ్డిస్తూ అంది అలివేణి.

లోలోపల ఆనందం అనిపించినా, నా గురించి పొగడ్త వినటం బిడియంగా అనిపించి, "దాన్దేముందమ్మా! ఏదో నా చాతనయిన సాయం చేసా..." అన్నాను పెరుగు తియ్యదనం ఆస్వాదిస్తూ.

భోజనం అయ్యాక ఆరుబయట కుర్చీల్లో కూర్చున్నాం. చక్కటి దక్షిణపుగాలి. ప్రాణం ఊగ్రూతలూగింది. పొట్ట బరువనిపించి, కాస్సేపు పచార్లు చేయాలనిపించింది. వెంటనే పిట్టగోడ వెంట నడకసాగించాను. అప్పారావు బద్ధకంగా కుర్చీలోనే జారగిలపడ్డాడు.

పిట్టగోడవెంట నడుస్తూనే పరిసరాలు పరికించసాగాను. చుట్టూ దట్టంగా ఇళ్లు. చాలా వరకూ డాబాలు. ఇంటిముందు రాజవీధి, దానికవతల చిన్నమేడ. ఆ మేడ మీద వంటరి గది. ఆ గదిలో ఎవరో యువదంపతులు కాపురం ఉంటున్నారల్లే ఉంది. కొత్త ప్రేమ కొద్దీ ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారు. అతను కంచాలు పెడుతూంటే ఆమె వడ్డిస్తోంది. ఆమె అన్నం కలుపుతూంటే అందులోంచి ముద్దలు దొంగిలిస్తూ, చిలిపిగా నవ్వుతున్నాడతను. శరీరాల మీద దాడులతో సరసాలు కూడా! వాళ్లకి పరిసరాల స్పృహ ఏకోశానా ఉన్నట్టులేదు. కొద్ది నిమిషాలు వాళ్లని చూసి మళ్లీ నడకసాగించాను. ఈ మాటు దక్షిణం అంచువెంట నడిచాను. అవతలివైపు చూసి క్షణం బిగుసుకుపోయాను. ప్రక్క ఇంటి ఆవరణలోని కప్పులేని బాత్‌రూమ్‌లో ఓ స్త్రీ పూర్తి నగ్నంగా స్నానం చేస్తోంది. (స్త్రీలు నగ్నంగా స్నానం చేస్తారని వినటమేగానీ ఇంత కుపూర్వం చూడలేదు!) పొరబాటున తలెత్తి నన్ను చూస్తే కొంపలంటుకుపోగలవని భయపడి, గప్‌చిప్‌గా వచ్చి అప్పారావు ఎదురు కుర్చీలో కూర్చున్నాను.

నా వాలకం గమనించి "ఏమిట్రా! అలా వచ్చేసావేం? అప్పుడే భుక్తాయాసం తీరిందా?" అన్నాడు.

నా ఇబ్బంది విప్పి చెప్పాను.

ఫకాలున నవ్వి, "ఇంత మాత్రానికే వణికిపోతే నువ్వేం మగాడివిరా?" అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూసాను.

"అవున్రా! మన మేడమీద మనం తిరుగుతున్నాం. మన కంటపడకుండా వాళ్లు జాగ్రత్త పడాలి. మనం కాదు..."

ఎందుకో వాడి వాదన నాకు నచ్చలేదు.

సభ్యత, సంస్కారం వంటి మాటలతో ఏదో చెప్పాలనిపించి, అప్పారావు మీద అలాంటివి పనిచేయవు గనుక నోరు మూసుకున్నాను.

"నీకో రహస్యం చెప్పనా?"

"ఏమిటది?" అన్నట్టు చూసాను.

"రోడ్డు కవతల మేడమీద కొత్త దంపతుల్ని చూశావా?" అనడిగాడు.




"చూసాను..."

"కాణీ ఖర్చు లేకుండా రోజూ బ్లూఫిల్మ్ చూపిస్తూంటారు... కొత్త దంపతులుకదా?" వెకిలిగా నవ్వుతూ సిగిరెట్ వెలిగించుకున్నాడు.

నాకెందుకనో తిన్న భోజనం రుచి పోయి నట్లనిపించింది. అప్పారావు అతి త్వరలో చిక్కు ల్లో ఇరుక్కుంటాడన్న గట్టి నమ్మకం మనసులో నాటుకుంది.

వెళ్లటానికి లేచాను.

"అదేమిటీ... అప్పుడే వెళ్లిపోతావా?!" అనడిగాడు ఆశ్చర్యంగా.

"వెళ్లాలి..." అంటూ మెట్లవేపు నడిచాను. నావెంట అప్పారావు కూడా వచ్చాడు.

వీడ్కోలు చెప్పేముందు "అప్పారావ్! రోజు లన్నీ మనవికాదు. కాస్త జాగ్రత్త" అంటూ ప్రశ్నలకి తావీయకుండా వడివడిగా నడిచాను.

★ ★ ★

అప్పారావు కాలికి ఆరుంగుళాల బ్యాండే జితో అయిదు గంటలవేళ - అంటే ఆఫీసు వదిలే సమయానికి కుంటుకుంటూ నా సీటు వైపు రావటం చూసి ఆశ్చర్యపోయాను.

వాడిని పరిశీలిస్తూంటే, నా హెచ్చరిక నిజమైందని తెలుస్తూనే ఉంది. చుట్టుపక్కల ఇళ్ల వాళ్లెవరో ఇహ ఓపికపట్టలేక వీడికీ గతి కలిగించారని ఊహించాను.

నా ఊహ ముగించకముందే వచ్చి ఎదురు కుర్చీలో కూర్చున్నాడు అప్పారావు.

తలదించుకుని "మేం ఇల్లు మారాం..." అన్నాడు.

"ఎప్పుడు...? ఎందుకు...?" అన్నాను గబగబ.

వాడు తలెత్తి నాకేసి దీనంగా చూసాడు.

"నీ కాలుకి దెబ్బ తగలటానికి మేడచుట్టూ వాళ్లే కారణమా?" జాలిగా అడిగాను.

"కాదు..."

"మరి?"

"మా ఆవిడ.." - మళ్లీ తలదించుకున్నాడు.